క్లుప్తంగా

ఘనంగా పశువుల పండగ



ఆవును ఊరేగిస్తున్న గ్రామస్తులు

రామసముద్రం: రామసముద్రం మండలంలోని తిరుమలరెడ్డిపల్లిలో గురువారం ఘనంగా పశువుల పండుగ నిర్వహించారు. ఇంటి ముందు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. పశువులను రంగులు, బెలూన్లతో అలంకరించి బ్యాండువాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. గ్రామంలో బంధుమిత్రులు సందడితో కళకళలాడింది. టీడీపీ నాయకుడుఎస్ ఎ మస్తాన్, ఆవని మాజీ సర్పంచ్ విజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆనందాశ్రమంలో ఆరాధనోత్సవం

తంబళ్లపల్లె: మండలంలోని ఎద్దులవారిపల్లె గ్రామం శ్రీ భగవాన్ కొండవధూత స్వామి ఆనందశ్రమంలో గురువారం నిర్వాహకులు నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి గురుప్రార్థనలు, ఆరాధన కైంకర్యాలు జరిగాయి. 10 గంటల నుంచి గంధం, జెండా ఉత్సవాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురువులు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేశారు.

అంకిరెడ్డి మృతి తీరనిలోటు



అంకిరెడ్డి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న నిస్సార్‌అహ్మద్

మదనపల్లె సిటీ: మదనపల్లె రెడ్డి సంఘం మాజీ అధ్యక్షుడు అంకిరెడ్డి మృతి తీరని లోటని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ అన్నారు. గురువారం అంకిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంకిరెడ్డి రెడ్డి సంఘం కోసం తన వంతు కృషి చేశారన్నారు. అలాగే బీటీ కాలేజీ లైబ్రేరియన్‌గా సేవలు అందించారన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బోర్డులు సరే.. సమాచారమేదీ?

- యార్డులో కానరాని టమాటా ధరలు
- ఖాళీగా దర్శనమిస్తున్న సమాచార బోర్డులు



గుర్రంకొండ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన బోర్డు

గుర్రంకొండ: గుర్రంకొండ మార్కెట్‌యార్డులో టమాటా ధరలను సూచించే బోర్డులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. బోర్డుల్లో పరిసర ప్రాంతాల మార్కెట్ యార్డుల్లో ఎంతమేరకు టమాటా ధరలు ఉన్నాయో ప్రతిరోజు నమోదు చేయాల్సి ఉంది. అయితే సమాచార బోర్డుల్లో ఎలాంటి ధరల సమాచారం లేక పోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. సాధారణ బ్లాక్ బోర్డుతో పాటు కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులో కూడా ధరల సమాచారం కనిపించడం లేదు. ప్రతి రోజూ మార్కెట్ యార్డులో టమాటాల వేలం పాటలు నిర్వహించే సమయానికి మార్కెట్‌యార్డుల్లో టామాటా ధరలు ఎంతమేరకు ఉన్నాయో.. ఆయా బోర్డుల్లో సమాచారం ఉంచేవారు. రైతులు ముందుగానే వచ్చి ఆ రోజు ధరలపై ఒక అంచనాకు వచ్చేవారు. అయితే గత కొన్ని రోజులుగా ధరల సమాచారం తెలియడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

దిష్టిబొమ్మల్లా సమాచార బోర్డులు

మదనపల్లె, కలికిరి మార్కెట్ యార్డుల్లోని టమాటా ధరలతో పాటు చుట్టుపక్కల పట్టణాల్లోని యార్డుల్లో ఉన్న ధరలను డిజిటల్ బోర్డులో చూపించేవారు. గుర్రంకొండ మార్కెట్ యార్డులో సాయంకాలం 4 గంటల నుంచి టమాటాల వేలం పాటలు ప్రారంభమవుతుంటాయి. అయితే అప్పటికే చుట్టుపక్కల ఉన్న పలు పట్టణాల్లోని యార్డుల్లో టామటా వేలం పాటలు ముగిసిపోయి ధరలు తెలిసిపోతుంటాయి. దీంతో గుర్రంకొండ యార్డులో సాయంకాలమే అన్ని మార్కెట్లలోని టమాటా ధరలు వేలం పాటల కంటే ముందే ప్రకటించేవారు. దీంతో యార్డులో సమాచార బోర్డులు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే బోర్డుల్లో సమాచారం పొందుపరచాలని కోరుతున్నారు.

సమాచారం అందుబాటులో ఉంచుతాం



యార్డులోని సమాచార బోర్డుల్లో టమాటా ధరలను రైతులకు అందుబాటులో ఉంచుతాం. యార్డులో రెండుచోట్ల ధరల సమాచార బోర్డులు ఏర్పాటు చేశాం. అయితే కొన్ని నెలలుగా అవి వినియోగంలోకి రావడం లేదు. ఇప్పటి నుంచి సమాచారం ప్రతిరోజు బోర్డుల్లో ఉంచుతాం.

– కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

పారిశుద్ధ్య కార్మికులకు పని భారం తగ్గించాలి



మాట్లాడుతున్న పి.సుబ్బారాయుడు

మదనపల్లె : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పని భారం తగ్గించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని టౌన్ హాల్‌లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు నేలపాటి శ్రీనివాసులు అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బరాయుడు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల దీర్ఘకాలిక ఈపీఎఫ్ సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం మున్సిపల్ వర్కర్స్ సమస్యలపై దృష్టి సారించడం లేదని ఫలితంగా కార్మిక సమస్యలు కుప్పలు తెప్పలుగా పేరుకు పోయాయని అన్నారు. మున్సిపల్ కార్మికులపై పనిభారం అధికమైందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు మాసాలైనా మున్సిపల్ వర్కర్స్ గత ప్రభుత్వంలో చేసిన సమ్మెకాలపు హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని, మున్సిపల్ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు అతి తక్కువ వేతనాలు ఇస్తూ వారి శ్రమను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఉపాధ్యక్షులు పి.ఎల్ నర్సింహులు, కార్యదర్శి సురేష్ కుమార్, సీపీఐ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి మురళి, ఏఐటీయూసీ నాయకులు దేవా పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు 27 నుంచి ఇంటర్వ్యూలు

సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో రేషన్ షాపు డీలర్ల రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ నెల 27 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల 81 రేషన్‌షాపు డీలర్ల నియామకానికి సంబంధించి నిర్వహించిన రాతపరీక్షల్లో 251మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. వీరికి ఎంపిక చేసిన తేదీల్లో చౌకదుకాణల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, అభ్యర్థులు ఏ తేదీల్లో ఇంటర్వ్యూకు హాజరుకావాలనే సమాచారం సంబంధిత సివిల్ సప్లయిస్ డీటీ, స్థానిక వీఆర్వోలకు తెలపడం జరుగుతుందన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు, తమ అర్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఇంటర్వ్యూ 20 మార్కులకు ఉంటుందని, వినియోగదారుల సంబంధాలు, నిర్వహణ సామర్థ్యం, ఆర్థిక స్తోమత అంశాలపై ప్రశ్నలు అడుగుతారని పేర్కొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

కేవీపల్లె : ప్రతీ ఒక్కరూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని పీలేరు లేబర్ ఆఫీసర్ ఆనందబాబు, ఎంఈఓ రెడ్డిబాషా అన్నారు. గురువారం మండలంలోని కేవీపల్లె, గర్నిమిట్టలో బాలకార్మిక నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలకార్మిక చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం బడివయస్సు పిల్లలు పనిలో కాకుండా బడిలోనే ఉండాలని తెలిపారు. డాక్టర్ అర్చన, శిశు సంక్షేమశాఖ, విద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల చదువు సమాజానికి వెలుగు

కేవీపల్లె : బాలికల చదువు సమాజానికి వెలుగు నింపుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, ఐసీపీఎస్ సోషల్ వర్కర్ లావణ్య అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికల అభివృద్ధిపై అవగాహన సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం వై.వి. రమణ, మహిళా పోలీస్ శివకుమారి, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ భానుమూర్తిరావు

బి.కొత్తకోట: పక్కా గృహాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలని ఎంపీడీఓ మంగళం శంకరయ్య కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల వారీగా ఇళ్ల లక్ష్యాలను సమీక్షించారు. ఆర్‌సీ స్థాయిలోని ఇళ్లను పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనులు చేసుకున్న లబ్ధిదారులకు వెనువెంటనే బిల్లులు మంజూరయ్యేలా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఏఈ లావణ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ అలీఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

కలికిరి: పక్కా గృహాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలని ఎంపీడీఓ భానుమూర్తిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం హౌసింగ్ శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న ఇళ్లను మార్చి నెల లోపు పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, వివిధ స్థాయిలో నిర్మాణాలు పూర్తైన వెంటనే బిల్లులు మంజూరు చేయాలని సూచించారు. హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

తంబళ్లపల్లె: పక్కా ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి లబ్ధిదారులకు సూచించారు. గురువారం ఆయన తంబళ్లపల్లె సబ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన హౌసింగ్ కాలనీ పరిశీలించారు. ఆర్థిక సమస్య ఉన్నవారికి వెలుగు ద్వారా రూ.లక్ష రుణ సౌకర్యం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఈ సుజాత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శేషాద్రి పాల్గొన్నారు.

రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలి



భూముల రీసర్వే పరిశీలిస్తున్న ఏడీ భరత్

పీలేరురూరల్ : భూముల రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా సర్వే అధికారి (ఏడీ) భరత్ అన్నారు. గురువారం మండలంలోని వేపులబైలు పంచాయతీలో మూడో విడత భూముల రీసర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూసమస్యల పరిష్కారం కోసమే భూముల రీసర్వే చేపట్టడం జరిగిందన్నారు. రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే నిర్వహించి హద్దులు చూపించాలని తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు. మొదటి రోజులు 20 ఎకరాలు రీసర్వే చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఐ గురివిరెడ్డి, తహశీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు, డీటీ సుబ్రమణ్యం, సర్వేయర్ కిరణ్మయి, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

నట్టల మందుతో ఆరోగ్యంగా జీవాలు

కలికిరి: నట్టల మందుతో జీవాలు ఆరోగ్యంగా ఉంటాయని పశువైద్యశాల సహాయ సంచాలకులు డా. వెంకటమునినాయుడు తెలిపారు. మండలంలోని మర్రికుంటపల్లి గ్రామంలో గురువారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి గిరినాథరెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు : మండలంలోని వేపులబైలు పంచాయతీ జంగంపల్లెలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో 163 పశువులకు వైద్య పరీక్షలు చేసినట్లు పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో దూడలకు పాము మందు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు.

వక్తృత్వ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పీలేరు : ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఎంఈఓ లోకేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక జెడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాలలో 'ఫ్రీ అండ్ ఫైర్ ఎలక్షన్స్ – ది రోల్ ఆఫ్ పొలిటికల్ పార్టీస్' మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్‌స విభాగంలో ఎస్. తానీయా సుల్తానా (ఎస్‌జీడిగ్రీకాలేజ్), బి. పూజ (ప్రభుత్వ జూనియర్ కాలేజ్), ఎస్. మానస (చైతన్యజూనియర్ కాలేజ్) మొదటి మూడు స్థానాలు సాధించారని తెలిపారు. అలాగే జూనియర్స్ విభాగంలో ఎస్ వర్షితారెడ్డి (కోటపల్లె బాలికోన్నత పాఠశాల), ఎస్. సలియా, సబీయా (జెడ్పీ మెయిన్ స్కూల్) మొదటి మూడు స్థానాలు సాధించారని తెలిపారు. ఈ నెల 25న తహసీల్దార్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ చంద్రశేఖర్, హెచ్‌ఎం సురేంద్రనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ క్వారీలపై గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తాం

కేవీపల్లె : మండలంలోని అడవిపల్లె రిజర్వాయర్ సమీపంలో కొండల్ని పేల్చి పర్యావరణానికి విఘాతం కల్గించడంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్. నరసింహులు, నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా నిషేధిక పేలుడు పదార్థాలతో కొండలను పేల్చడంతో పర్యావరణ కాలుష్యం ఏర్పడుతోందన్నారు. అటవీ జంతువులు అంతరించిపోయే ప్రమాదం ఉందని, నేల కోత ఏర్పడుతుందని, నీటి కాలుష్యం, వాయికాలుష్యం, శబ్దకాలుష్యానికి దారి తీస్తున్నట్లు తెలిపారు. అక్రమ క్వారీలతో సమీప గ్రామాలైన తీతవగుంటపల్లె, మఠంపల్లె, తిమ్మాపురం గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రికి, మంత్రులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. దీంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇది కృత్రిమ మేధ యుగం



మాట్లాడుతున్న కె. రవికిశోర్

కురబలకోట: ఇది కృత్రిమ మేధ యుగమని, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) వివిధ రంగాల్లో ఊహించని మార్పులతో సంచలనాన్ని సృష్టిస్తోందని వరంగల్‌లోని నిట్ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ కె. రవికిశోర్ అన్నారు. అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఏఐ టూల్స్‌పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఏఐ ఆగమనంతో పరిశ్రమల్లో ఆవిష్కరణల దృశ్యాన్ని విప్లవాత్మకంగా మార్చిందని పేర్కొన్నారు. సులభం ఆపై ఖచ్చితమైన పరిష్కారాలను సృష్టించడానికి వీలు కలిగిందని, మోసాలకు అడ్డుకట్ట వేస్తోందని చెప్పారు. అనేక సంస్థలు వివిధ రంగాల్లో ఏఐ టూల్స్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. ఈ రంగంలో ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు ఉన్నాయని అన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పీలేరు రూరల్ : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కులు, విధులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏదైనా వస్తువులు కొనేటప్పుడు ట్రేడ్‌మార్క్ చూసి కొనాలని సూచించారు. కామర్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి లెఫ్టినెంట్ డాక్టర్ ఎం.వెంకటరమణయ్య, మాట్లాడుతూ వినిదారులపై జరిగే అన్యాయాలపై ఎలా ఫిర్యాదు చేయాలని, ఉమ్మడిగా ఎలా ఎదుర్కోవాలన్న అంశాలపై అవగాహనఅవసరమని భిప్రాయపడ్డారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

తరగని స్ఫూర్తి.. నేతాజీ సుభాష్ చంద్రబోస్



మదనపల్లె : నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



బి.కొత్తకోటలో..

మదనపల్లె : భారత స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ యువతకు స్ఫూర్తి అని బీజేపీ నాయకులు బండి ఆనంద్, వి.నారదరెడ్డి అన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నేతాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువతకు స్ఫూర్తి, దేశభక్తికి నిలువెత్తు నిదర్శనం సుభాష్ చంద్రబోస్ అన్నారు. బ్రిటీష్ పాలనలో మగ్గిపోతున్న ప్రజలకు అండగా నిలిచి, బ్రిటీష్ వారిని గడగడలాడించిన భరతమాత ముద్దుబిడ్డ నేతాజీ అంటూ కొనియాడారు. స్వతంత్ర భారతావని కోసం ఆయన చేసిన పోరాటం అనన్య సామాన్యమని కీర్తించారు. జయచంద్రారెడ్డి, దామోదర్, యుగంధర్‌రెడ్డి, రమణారెడ్డి, రాజన్న, అజయ్, మోహన, మల్లికార్జున, గిరి, మానవత అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో నేతాజీ జయంతి

బి.కొత్తకోట: స్థానిక రంగసముద్రం రోడ్డులో, పోలీస్ స్టేషన్లో గురువారం వేర్వేరుగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు జరిగాయి. ఆయన చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సమావేశంలో ఉక్కు సలహా మండలి మాజీ సభ్యులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, స్వతంత్ర పోరాటంలో 11 సార్లు కారాగారంలో నేతాజీని నిర్బంధించారని అన్నారు. హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో జరిగిన పోలీసులు రెడ్డెప్ప నాయక్, సురేంద్ర, మారుతి ప్రసాద్, హెల్పింగ్ మైండ్స్ ఫయాజ్, గంగరాజు,దేవరింటి కుమార్, అబ్దుల్ రెహమాన్, నక్కా మహేష్, శతృఘ్న, మురళీ, రెహమాన్ పాల్గొన్నారు.

రక్తదానం

మదనపల్లె సిటీ: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి రక్తదానం చేసేందుకు ముందుకు రావడం మానవత్వానికి ప్రతీక అని హెల్పింగ్ మైండ్స్ సంస్థ వ్యవస్థాపకులు అబుబకర్‌సిద్దిక్ అన్నారు. గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకుని హెల్పింగ్‌మైండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 32 మంది రక్తదానం చేశారు. వాలంటరీ బ్లడ్ బ్యాంకు బాలచంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణ, హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు కిరణ్, చరణ్, చైతు, పవన్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

గుర్రంకొండ: మండలంలోని సంగసముద్రం పంచాయతీ కుమ్మరపల్లె ప్రాథమిక పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం మండల బీజేపీ అధ్యక్షుడు రామాంజులు ఆధ్వర్యంలో నేతాజి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పూజలు నిర్వహించారు. నేతాజీ దేశానికి చేసిన సేవల్ని అందరూ కొనియాడారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వర్‌నాయక్, షామీర్‌భాషా, విద్యార్థులు పాల్గొన్నారు.



గుర్రంకొండ: కుమ్మరపల్లె ప్రాథమిక పాఠశాలలో..